సాక్షి నాగర్‌కర్నూల్
శనివారం | 21 | డిసెంబర్ | 2024



..ఇసుక వివాదం

తుంగభద్ర నదిలో ఆంధ్రప్రదేశ్‌- తెలంగాణ మధ్య ఇసుక వివాదం నెలకొంది.

వివరాలు 8లో ▸



జాతీయ స్థాయి పోటీలు

కోస్గి పట్టణం జాతీయ స్థాయి అండర్‌-19 వాలీబాల్‌ పోటీలకు వేదిక కానుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /19.9

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్‌

28 నుంచి ఏపీజీవీబీ సేవల్లో అంతరాయం

నాగర్‌కర్నూల్‌ క్రైం: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంక్‌ను 2025 జనవరి 1 నుంచి తమ కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల్లో విభజించనుందని, ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంక్‌ సేవలు అందుబాటులో ఉండవని నాగర్‌కర్నూల్‌ రీజినల్‌ మేనేజర్‌ రంజిత్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంక్‌కు చెందిన 493 శాఖలు తెలంగాణలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్నాయని, విభజన ప్రక్రియలో భాగంగా సాంకేతిక సమస్యలతో బ్యాంకింగ్‌ సేవలకు తాత్కాలిక అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఖాతాదారులు ముందుగానే తమ లావాదేవీలను ప్రణాళికబద్ధంగా చేసుకోవాలని కోరారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

నాగర్‌కర్నూల్‌ క్రైం: డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు సలహాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని ఆమె కోరారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫోన్‌ చేయదలచిన వారు సెల్‌ నం.99592 26288ను సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి



నాగర్‌కర్నూల్‌ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్‌ శాఖ నిరంతరం కృషిచేస్తుందని డీఎస్పీ శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలో కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఇళ్లు అద్దెకు కావాలని వస్తే వారి ఆధార్‌కార్డు తీసుకోవాలన్నారు. సంఘ విద్రోహులను గుర్తించే ఉద్దేశంతోనే పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎక్కడో ఒకచోట కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహిస్తామని చెప్పారు. ఈ క్రమంలో సరైన పత్రాలు లేని 35 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు సీజ్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ కనకయ్యగౌడ్‌, ఎస్‌ఐ గోవర్ధన్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు పూర్వవైభవం తెస్తాం



మన్ననూర్‌: టీటీడీ, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో అమ్రాబాద్‌ మండలం వటువర్లపల్లిలో కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామంలో ఆలయం నిర్మించేందుకు గానూ గతంలో టీటీడీ వారికి గ్రామం తరఫున విన్నవించగా.. ఇప్పుడు ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారన్నారు. పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో టీటీడీ ఆదేశాల మేరకు వికాస తరంగిణి, గ్రామస్తులు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేసి ఆలయం నిర్మాణం పనులు ప్రారంభించారు.

■ ఎంతో చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతినిత్యం ఆరాధన చేయాలని రామానుజ జీయర్‌స్వామి అన్నారు. ఐదు రోజులుగా నల్లమలలో పర్యటిస్తున్న స్వామివారిని మన్ననూర్‌లో భక్తులు సాదర స్వాగతం పలికి ఆలయం ప్రాంగణంలో పాదపూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఆశీర్వదించిన ఆయన అద్భుతంగా నిర్మించిన ఆలయం, ముందు భాగంగో ఉన్న 28 అడుగుల ఎత్తైన ఏకశిల రాతి స్తంభంను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆశీర్వచనాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో శివప్రసాద్‌, కొండల్‌, శ్రీరాంనాయక్‌, మల్లేష్‌, శ్రీనివాస్‌, శ్రీను, సర్యానాయక్‌, లాలయ్య, కిష్టయ్య, పత్యానాయక్‌, మాజీ ఎంపీటీసీ అలివేల, సుగుణమ్మ, ఆలయ పూజారి నర్సింహశర్మ తదితరులు పాల్గొన్నారు.

● వేగంగా 'వెనక్కి'..

కృష్ణమ్మ తగ్గుముఖం



శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌

- రోజురోజుకు తగ్గిపోతున్న బ్యాక్‌ వాటర్‌
- నెలరోజుల కనిష్ట స్థాయికి శ్రీశైలం డ్యాం నిల్వలు
- ప్రస్తుతం 863 అడుగుల మేర నీటిమట్టం
- సాగునీటితోపాటు, మిషన్‌భగీరథ పథకానికి వినియోగం
- నీటినిల్వకు అదనపు రిజర్వాయర్ల నిర్మాణమే పరిష్కార మార్గం

కొల్లాపూర్‌: కృష్ణానదిలో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నెలరోజుల కనిష్టానికి నీటిమట్టం చేరుకుంది. జనవరి నెలాఖరులో ఉండే లెవల్‌కు డిసెంబర్‌లోనే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ తగ్గిపోయింది. రాయలసీమలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులకు విరివిగా నీటిని తరలిస్తుండటంతో పాటు, శ్రీశైలం డ్యాం వద్ద విద్యుదుత్పత్తి, కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు చేపట్టడంతో కృష్ణానదిలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది.

ఈ ఏడాది 23 టీఎంసీలు

కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా 40 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునేందుకు కేఆర్‌ఎంబీ అనుమతులు ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 23 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ప్రాజెక్టులోని మూడు మోటార్ల ద్వారా ఎత్తిపోతలు సాగుతున్నాయి. రోజూ 2,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. మరో 17 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునేందుకు వెసులుబాటు ఉన్నప్పటికీ చాలినన్ని రిజర్వాయర్లు లేకపోవడంతో నీటి ఎత్తిపోతలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

రిజర్వాయర్ల కొరత..

నాగర్‌కర్నూల్‌ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన కేఎల్‌ఐ ప్రాజెక్టు కింద నాలుగు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో నీటి నిల్వ సామర్థ్యం కేవలం 4 టీఎంసీలు మాత్రమే. రిజర్వాయర్ల సామర్థ్యం తక్కువగా ఉండడంతో నియోజకవర్గాల్లోని చెరువులకు కూడా కృష్ణానది నీటిని కాల్వల ద్వారా మళ్లిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో నీటి కేటాయింపులను వినియోగించుకోవాలన్నా.. వేసవిలో నీటి కష్టాలు రాకుండా ఉండాలన్నా అదనపు రిజర్వాయర్ల నిర్మాణమే పరిష్కారమని సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆగస్టు నెలలో వరదలు

శ్రీశైలం బ్యాక్‌ వాటర్‌ ఫుల్‌గేజ్‌ 885 అడుగులు. ఆగస్టు నెలలో కృష్ణానదికి వరదలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్‌ నెలాఖరు నాటికి శ్రీశైలం డ్యాం నిండింది. వరదల సమయం నుంచి కేఎల్‌ఐ ప్రాజెక్టులో ఎత్తిపోతలు చేపట్టారు. సాగునీటి అవసరాలతోపాటు మిషన్‌ భగీరథ స్కీం నిర్వహణ కోసం రోజూ 0.2 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 863 అడుగుల ఎత్తులో బ్యాక్‌వాటర్‌ ఉంది. 825 అడుగుల వరకు కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసుకోవచ్చు. అయితే గతంలో కంటే ఈసారి వేగంగా బ్యాక్‌వాటర్‌ నీటి మట్టం తగ్గుతోంది. ఏపీలోని పోతిరెడ్డిపాడు, హంద్రినీవా, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్ణీత మొత్తం కంటే ఎక్కువ స్థాయిలో నీటిని ఎత్తిపోయడమే ఇందుకు ప్రధాన కారణం.


ఉన్నతాధికారులకు సమాచారం

కేఎల్‌ఐ ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయి. ఎల్లూరు రిజర్వాయర్‌ ద్వారా మిషన్‌ భగీరథ స్కీంకు నీళ్లు అందిస్తున్నాం. రిజర్వాయర్‌లో నీళ్లు తగ్గిన వెంటనే మోటార్లు ఆన్‌ చేసి నీటిని ఎత్తిపోస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటివరకు 23 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం. ప్రస్తుతం ఎల్లూరు లిఫ్టులో మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా రెండింటికి మరమ్మతు చేపట్టాల్సి ఉంది. బ్యాక్‌ వాటర్‌ నీటి నిల్వలపై రెగ్యులర్‌గా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేస్తున్నాం.

– లోకిలాల్‌నాయక్‌, మిషన్‌ భగీరథ డీఈఈ

మూడు మోటార్లతోనే..

కేఎల్‌ఐ ప్రాజెక్టులో రిజర్వాయర్ల కొరతతో పాటు మోటార్ల సమస్య కూడా సాధారణ అంశంగా మారింది. ప్రాజెక్టులో మొదటి లిఫ్టు అయిన ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఐదు మోటార్లు ఏర్పాటు చేశారు. వీటిలో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. పలు కారణాల వల్ల మరమ్మతు పనులు పూర్తి కావడం లేదు. ఐదు మోటార్లను వినియోగంలోకి తీసుకువస్తే మరిన్ని నీళ్లను ఎత్తిపోసుకునే వెసులుబాటు ఉంటుంది.



కేఎల్‌ఐ ద్వారా నీటి ఎత్తిపోతలు

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్‌

కల్వకుర్తి టౌన్‌/ కల్వకుర్తి రూరల్‌: ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఈఓ రమేష్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని కేజీబీవీ, మండలంలోని తర్నికల్‌ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వడ్డించే ఆహారం కలుషితం కాకుండా శుద్ధి చేసిన నీటినే వంటలకు వినియోగించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న స్టోర్‌ రూం, వంటగది, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అన్నం వడ్డించే ముందు ఉపాధ్యాయులు ఒకసారి రుచి చూడాలన్నారు. అలాగే తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉన్న రికార్డులను తనిఖీ చేసి.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కోఆర్డినేటర్‌ వెంకటయ్య, ఎంఈఓ శంకర్‌నాయక్‌, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

కందనూలు: రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని డీఈఓ రమేష్‌కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎస్సెస్సీ బోర్డు, ప్రభుత్వం గురువారం షెడ్యూల్‌ విడుదల చేసిందని, వచ్చే ఏడాది మార్చి 21 నుంచి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు మరో 95 రోజులు మాత్రమే ఉందని, మెరుగైన ఫలితాలు సాధించేలా సబ్జెక్టు ఉపాధ్యాయులు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు ఇతరత్రా పనులు చెప్పకుండా చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా వివిధ మాధ్యమాల 304 పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 10,553 మంది విద్యార్థులు ఈసారి పరీక్ష రాయనున్నారన్నారు.

టీజీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గం ఎన్నిక



రమేష్‌

నాగర్‌కర్నూల్‌: తెలంగాణ రెవెన్యూ సర్వీస్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడిగా పెద్దకొత్తపల్లి నాయబ్‌ తహసీల్దార్‌ రమేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో జిల్లా కమిటీతోపాటు నాలుగు నియోజకవర్గాల కమిటీలను రాష్ట్ర జేఏసీ చైర్మన్‌ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, అసోసియేట్‌ అధ్యక్షులుగా సీతారాం, విద్యాధరి, కార్యదర్శిగా మాసుం, సంయుక్త కార్యదర్శిగా జ్యోతి, గౌరవాధ్యక్షుడిగా ఖాజామైనొద్దీన్‌, కోశాధికారిగా పవన్‌కుమార్‌, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రవీణ్‌చంద్ర, ప్రచార కార్యదర్శిగా ఈశ్వర్‌, రాజేశ్వర్‌రెడ్డి, శివకృష్ణ, తిరుపతిరెడ్డి, ఈసీ మెంబర్లుగా హన్మంతు, ఖాజా, శివకుమార్‌లను ఎన్నుకున్నారు. అలాగే నాగర్‌కర్నూల్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా వెంకటేష్‌, కల్వకుర్తి డివిజన్‌ అధ్యక్షుడిగా వసీం అక్రం, కొల్లాపూర్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా గోవింద్‌రెడ్డి, అచ్చంపేట డివిజన్‌ అధ్యక్షుడిగా బీష్వా, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పురుగు మందు, విత్తన చట్టాలపై అవగాహన



డీలర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌

నాగర్‌కర్నూల్‌: రైతులకు విత్తనాలు, పురుగు మందులు అమ్మే డీలర్లకు చట్టాలపై అవగాహన ఉండాలని కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేశి శిక్షణలో భాగంగా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న 79 మంది విత్తన డీలర్లకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. 'డిప్లొమా ఇన్‌ అగ్రికల్చర్‌ సరీ్వసెస్‌ ఫర్‌ ఇన్‌పుట్‌ డీలర్స్‌– దేశి' పేరుతో అందించే ఈ కోర్సు ఏడాదిపాటు ఉంటుందని, కేవలం డీలర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కోర్సు అన్నారు. పంటలకు ఉపయోగించే ఎరువులు, చీడపీడల నివారణకు వాడే పురుగు మందులకు ప్రామాణికం ఏమిటి.. ఏ ప్రాతిపదికన వాటిని వినియోగించాలి.. విక్రయించే డీలర్లకు అవగాహన లేమి.. వంటివి పరిష్కరించే దిశగా దేశీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 79 మంది డీలర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. కోర్సు వ్యయంలో సగం కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా మిగతాది డీలర్లు భరించాల్సి ఉంటుందని, ఈ శిక్షణతో తమకు ఎంతగానో ప్రయోజనం ఉందని డీలర్లు చెబుతున్నారన్నారు. జిల్లాలో 446 ఎరువులు, 556 పురుగు మందుల డీలర్లు ఉన్నారని తెలిపారు. సమావేశంలో డీఏఓ చంద్రశేఖర్‌, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రమేష్‌, జిల్లా ఉద్యాన శాఖాధికారి జగదీష్‌, మండల వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

ప్రారంభానికి మెడికల్‌ కళాశాల సిద్ధం



ఉయ్యాలవాడ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్‌ కళాశాల

అన్ని హంగులతో నూతన భవన నిర్మాణం

- రూ.168 కోట్లతో 23 ఎకరాల్లో అధునాతన భవనాలు
- ప్రొఫెసర్లు, విద్యార్థులకు తీరనున్న కష్టాలు

నాగర్‌కర్నూల్‌ క్రైం: నాగర్‌కర్నూల్‌ జిల్లాగా మారడంతో అభివృద్ధిలో దూసుకుపోవడమే కాకుండా.. ఉన్నత విద్యాసంస్థల రాకతో రూపురేఖలే మారిపోతున్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో జిల్లాకు ప్రభుత్వ మెడికల్‌, నర్సింగ్‌ కళాశాలలు మంజూరుకావడంతో మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ సమీపంలో ఏర్పాటు చేశారు. అయితే శరవేగంగా నర్సింగ్‌ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టి అందులోనే ప్రభుత్వ మెడికల్‌ కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న మెడికల్‌ కళాశాల భవన నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు పూర్తికావడంతో త్వరలోనే అందుబాటులోకి రానుంది.

విద్యాబోధనకే పరిమితం..

ఉన్నత విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్‌ కళాశాల సొంత భవనంలోనే ప్రారంభించినప్పటికీ కేవలం కళాశాలలో విద్యార్థులకు విద్యా బోధన మాత్రమే పరిమితమైంది. మెడికల్‌ కళాశాలకు సంబంధించిన విద్యార్థులకు తాత్కాలిక వసతిని ప్రైవేటు బిల్డింగ్‌లో ఏర్పాటు చేయడంతోపాటు బోధనా సిబ్బందికి కూడా వసతి లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జిల్లాకేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ప్రైవేటు హాస్టల్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండేవారు. ప్రస్తుతం రూ.168 కోట్లతో 23 ఎకరాల్లో మెడికల్‌ కళాశాల నిర్మాణాలు పూర్తయి త్వరలోనే అందుబాటులోకి రానుండటంతో విద్యార్థులకు, బోధనా సిబ్బందికి ఇబ్బందులు తీరనున్నాయి.

త్వరలోనే నూతన భవనంలోకి..



నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ మెడికల్‌ కళాశాల భవనం పనులు పూర్తయ్యాయి. త్వరలోనే నూతన భవనంలోకి మెడికల్‌ కళాశాలను మార్చనున్నాం. అన్ని హంగులతో నూతన భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. విద్యార్థులకు, బోధనా సిబ్బందికి అన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. నూతన భవనం ప్రారంభానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అనుమతి తీసుకుని తేదీలను ప్రకటిస్తాం.

– రమాదేవి, ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌, నాగర్‌కర్నూల్‌

ఆహ్లాదకరంగా నూతన భవనం


జిల్లాకేంద్రంలో 2021లో ప్రభుత్వ మెడికల్‌ కళాశాలను ప్రారంభించినప్పుడు మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే బోధనలు జరిగేవి. ప్రస్తుత ం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించి 450 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. దాదాపు నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. నూతన ప్రభుత్వ మెడి కల్‌ కళాశాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలతో విశాలమైన తరగతి గదులతోపాటు హాస్టల్‌ సదుపాయం, ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. 23 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మించి.. సీసీ రోడ్లు, ఆహ్లాదకరంగా కనిపించేందుకు పార్కులను సైతం ఏర్పాటు చేశారు. మెడికల్‌ కళాశాల నూతన భవనంలోకి ఎవరు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ఏర్పా ట్లు చేశామని, భవనం ప్రారంభమైన తర్వాత విద్యా ర్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

● అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటనతో హర్షాతిరేకాలు

కార్పొరేషన్‌గా మహబూబ్‌నగర్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ/ దేవరకద్ర/ మద్దూరు: జిల్లాకేంద్రం ఇక కార్పొరేషన్‌గా మారనుంది. అలాగే దేవరకద్ర గ్రామపంచాయతీతో పాటు నారాయణపేట జిల్లాలోని మద్దూరు సైతం మున్సిపాలిటీగా అవతరించనున్నాయి. ఈ మేరకు గతంలోనే అధికారులు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఐటీ, మున్సిపల్‌ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ మూడింటిని అప్‌గ్రేడ్‌ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. కాగా, ప్రస్తుతం మహబూబ్‌నగర్‌ పట్టణ పరిధిలోని 49 వార్డులలో సుమారు 2.88 లక్షల జనాభా ఉంది. కొత్తగా కార్పొరేషన్‌ అయ్యేందుకు మూడు లక్షల జనాభా అవసరం కావడంతో శివారులోని జైనల్లీపూర్‌, దివిటిపల్లి గ్రామాలు విలీనం కానున్నాయి. ఈ రెండు కలుపుకొని డివిజన్లు 51కి చేరుతుంది. మొత్తం మీద కార్పొరేషన్‌ కానుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అదనపు నిధులు సమకూరి వివిధ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టవచ్చు. ఆయా వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి.

మున్సిపాలిటీలుగా మద్దూరు, దేవరకద్ర



మహబూబ్‌నగర్‌ పట్టణం వ్యూ

పన్నులు పెరుగుతాయని ఆందోళన

ఇదిలా ఉండగా ఆయా గ్రామాల్లో ఇక ఆస్తిపన్ను, నల్లా బిల్లులు, భవన నిర్మాణ అనుమతికి చెందిన చార్జీలు పెరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకు ఈ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కొనసాగుతుండగా.. ఇక నుంచి ఇది అమలు కాదని తెలుసుకున్న వారు ఏమి చేయాలోనని తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు గతంలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున ఇదే అదనుగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్‌ ఇవ్వడం గమనార్హం. ఒకవేళ సర్పంచ్‌ల పదవీకాలం కొనసాగి ఉంటే ఎక్కడికక్కడ గ్రామసభలు ఏర్పాటు చేసి మున్సిపాలిటీలుగా మార్చవద్దని తీర్మానాలు చేసేవారు.

ఎన్నికల హామీ మేరకు పురపాలికం

అసెంబ్లీ ఎన్నికలు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మద్దూరు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేశారు. మద్దూరు అనుబంధ గ్రామాలుగా ఉన్న భీంపూర్‌, నాగంపల్లి, సాపన్‌చెరువుతండాతో పాటు రెనివట్ల, వాల్యానాయక్‌తండా, అంబటోనివంపులను కూడా పురపాలికలో విలీనం చేశారు. 2023 లెక్కల ప్రకారం వీటన్నింటిలో కలిపి 12,595 మంది ఓటర్లు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య నాలుగుకు చేరింది.

మద్దూరు పురపాలికలో విలీన గ్రామాలు, ఓటర్లు

మద్దూరు	రెనివట్ల	భీంపూర్‌	నాగంపల్లి	సాపన్‌చెరువుతండా	ఎర్రగుంటతండా, వాయిలికుంట తండా	వాల్యానాయక్‌తండా	అంబటోనివంపు
7,200	3,800	50	470	120	475	50	430

నెరవేరిన దేవరకద్ర ప్రజల కల

ఐదు దశాబ్దాలుగా మేజర్‌ గ్రామపంచాయతీగా ఉన్న దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత చిన్న పట్టణాలు కూడా మున్సిపాలిటీలుగా మారాయి. కానీ స్థానిక పాలకుల నిర్లక్ష్యం వల్ల దేవరకద్రకు ఆ అవకాశం దక్కలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపాలిటీగా మార్చడానికి నాలుగు గ్రామాలతో కలిపి ప్రతిపాదనలు చేశారు. అయితే ఇది కార్యరూపం దాల్చకుండానే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పోయి కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చింది. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు చేయడంతో దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా దక్కింది.

దేవరకద్ర పురపాలికలోని విలీన గ్రామాలు, ఓటర్లు..

దేవరకద్ర	చౌదర్‌పల్లి	బలుసుపల్లి	పెద్దగోప్లాపూర్‌	మీనుగోనిపల్లి
6,315	1,114	643	593	707

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి


అరవిందమ్మ (ఫైల్)

దామరగిద్ద: ఇంటి ముందు కూర్చోగా పాము కాటు వేయడంతో ఓ మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బాపన్‌పల్లి గ్రామానికి చెందిన జనగారి అరవిందమ్మ(58) శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి ముందేట కొత్తగా ఇంటి నిర్మాణం కోసం చేపట్టిన బేస్‌మెంట్‌పై కూర్చుంది. కాగా అక్కడే రాళ్ల మధ్యలో ఉన్న నాగుపాము అరవిందమ్మను కాటు వేసింది. ఏదో విష పురుగు కరిచి ఉంటుందని నిర్లక్ష్యం వహించింది. ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు, టీ తాగింది. అంతలోనే అస్వస్థతకు గురవడంతో గుర్తుతెలియని విష పురుగు కరిచి ఉంటుందని అనుమానంతో బేస్‌మెంట్‌పై కూర్చున్న చోట వెతకగా నాగుపాము కనిపించింది. వెంటనే క్యాతన్‌పల్లిలో నాటు వైద్యుడి దగ్గరకు వెళ్లగా.. పరిస్థితి విషమించడంతో నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. అరవిందమ్మకు భర్త మొగులప్ప, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మరో మహిళ..


దస్లి (ఫైల్)

వెల్దండ: మండలంలోని జానలగట్టుతండాకు చెందిన వడ్యావత్ దస్లి(52) హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. వివరాలు ఇలా.. జానలగట్టుతండాకు చెందిన దస్లి వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు సాగు అందించే క్రమంలో ఈ నెల 2న పాటుకాటు వేసింది. దీంతో చికిత్స నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఈ ఘటనపై దస్లి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం


పావని (ఫైల్)

చారకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని సారంబండతండా సమీపంలో జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. చారకొండ ఎస్‌ఐ శంషుద్దీన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన పెరుమోల పావని(22), యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వెలకుర్తి హర్షవర్ధన్‌చారి ఇద్దరూ కలిసి శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై జడ్చర్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో నల్లగొండ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని సారంబండతండా సమీపంలో మూలమలుపు వద్ద ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన్న ఉన్న ఇనుప ర్యాంపును బలంగా ఢీకొట్టింది. దీంతో వెనక కూర్చున్న పావని ర్యాంపునకు తగలడంతో తలకు తీవ్రగాయాలవగా.. హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువతిని వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


జయకృష్ణ (ఫైల్)

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ స్వాతి కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లాకేంద్రానికి చెందిన జయకృష్ణ(28) ఉన్నత చదువు పూర్తి కాగా.. ఉద్యోగం చేయాలని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే ఉద్యోగం చేయడం ఇష్టం లేని జయకృష్ణ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ధర్మవరం స్టేజీ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా అదే దారి గుండా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శరీరమంతా నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సోదరి శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కోడె దూడల వేలం

- రూ. 1.87లక్షల ఆదాయం

దేవరకద్ర: చిన్నరాజమూర్ దేవాలయానికి భక్తులు సమర్పించిన కోడె దూడలను శుక్రవారం దేవాలయం వద్ద వేలం పాటలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారు రూ. 1.87లక్షలకు 40 కోడె దూడలను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో దేవస్థానం ఈఓ కవిత, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, చైర్మన్ రాఘవేంద్రచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య ఫ్యాక్టరీలు..!

రాష్ట్ర సరిహద్దు కర్ణాటక కడేచూర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో రసాయన కర్మాగారాలు

'నారాయణపేట జిల్లా కృష్ణా మండల సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలో వెలిసిన రసాయన కర్మాగారాల నుంచి వెలువడే దుర్వాసన, వ్యర్థాలతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారు. రోజు సాయంత్రం వేళ ఫ్యాక్టరీల నుంచి ముక్కులు పగిలిపోయేలా దుర్వాసన వస్తోందని.. భరించలేకపోతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు అనారోగ్యం బారిన పడ్డారని వివరించారు.'


రాష్ట్ర సరిహద్దు కర్ణాటకలో ఏర్పాటు చేసిన కెమికల్ ఫ్యాక్టరీ

- ఇతర ప్రాంతాల నుంచి వ్యర్థాల తరలింపు
- కాలుష్యం, దురాస్వనతో ఇబ్బందులు పడుతున్న పరిసర గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలకు సిద్ధమవుతున్న ప్రజలు


చేగుంట గ్రామం

కృష్ణా: కర్ణాటకలోని కడేచూర్ శివారులో ఇటీవల ఏర్పాటు చేసిన కెమికల్ ఫ్యాక్టరీల్లో ఇతర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలు తీసుకొచ్చి డంప్ చేయడంతో పాటు భూమిలో పాతిపెడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో ఈ ప్రాంతంలోని భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు భూ సారం కూడా దెబ్బతిని పంటలు పండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

పదుల సంఖ్యలో..

రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలో ఇప్పటికే పదుల సంఖ్యలో కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇరు రాష్ట్రాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్న ఫ్యాక్టరీల వ్యర్థాలను కూడా ఈ ప్రాంతానికి తీసుకొచ్చి ఇక్కడే భూమిలోకి వదులుతున్నారు. దీంతో మన రాష్ట్రంలోని చేగుంట, ఐనాపూర్, కున్సీ, ఆలంపల్లి, కర్ణాటకలోని బాడియాల్, సైదాపూర్, గూడూర్ మరో పది గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీల నుంచే వెలువడే వాసనలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్, బెంగుళూర్ తదితర సుదూర ప్రాంతాల్లోని కంపెనీలు వదిలే ప్రమాదకరమైన వ్యర్థాలను ఇక్కడ డంపు చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఈ ఫ్యాక్టరీలతో తమతో పాటు తమ భూములు దెబ్బతింటున్నాయని చెబుతున్నా. జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

చిన్నారులు, వృద్ధుల అవస్థలు..



కంపెనీల నుంచి వచ్చే పొగ, వాసనతో గ్రామంలోని వృద్ధులు, చిన్నారులు దగ్గు, ఆస్తమా బారిన పడుతున్నారు. తక్షణమే అధికారులు ఆయా కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలి.

– మహేష్‌స్వామి, రైతు, చేగుంట

వాసన భరించలేకపోతున్నాం



రోజు సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు కంపెనీల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం. ఆరుబయట తిరగాలంటేనే ఇబ్బందిగా ఉంది. ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతామనే భయం వెంటాడుతోంది.

– విశ్వనాథ్‌రెడ్డి, చేగుంట

ఆందోళన చేపడతాం..



ఫ్యాక్టరీల మూలంగా ఇబ్బందులకు గురవుతున్నారు. త్వరలోనే అన్ని గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టబోతున్నాం. అలాగే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తాం. న్యాయం జరిగే ఉద్యమం చేపడతాం.

– సిద్దప్ప, రైతు, చేగుంట

ఫ్యాక్టరీల సంగతి తెలియదు..

సరిహద్దులోని కర్ణాటకలో ఫ్యాక్టరీలు ఉన్న విషయం, వాటి నుంచి వెలువడే కాలుష్యం, దుర్వాసన గురించి మాకు తెలియదు. మేము ఏం చేయలేం.

– దయాకర్‌రెడ్డి, తహసీల్దార్, కృష్ణా మండలం

సరిహద్దులో ఇసుక వివాదం


తుంగభద్ర నదిలో సరిహద్దు స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ

- జిల్లా వాసులను నదిలోకి రావద్దని కర్నూలు వాసుల అడ్డగింత
- న్యాయం చేయాలని జిల్లా అధికారులకు గోడు వెళ్లబోసుకున్న స్థానికులు
- తుంగభద్ర నదిలో సరిహద్దును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్
- ఏపీ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ

రాజోళి: తుంగభద్ర నదిలోని మా వైపు ఉన్న భాగాన ఇసుక తీసేందుకు వెళ్తే కర్రలు, రాళ్లతో కర్నూల్ జిల్లాలోని ఒక గ్రామం వాళ్లు దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండలంలోని తూర్పుగార్లపాడు గ్రామస్తులు జిల్లా అధికారులకు విన్నవించారు. తుంగభద్ర నదిలో ఏపీ–తెలంగాణ మధ్యలో ఇసుక వివాదం నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, మైనింగ్ ఏడీ వెంకటరమణ, డీఎస్పీ సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. ఇరు ప్రాంతాలకు వివాదంగా మారిన సరిహద్దు ప్రదేశాన్ని చూసేందుకు నదిలో నీరు ఉండటంతో ట్రాక్టర్‌పై వెళ్లి ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, జిల్లాలోని ట్రాక్టర్ యజమానులు అధికారులకు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఏపీలోని అధికార పార్టీ నాయకుల అండతో అక్కడి ఇసుక మాఫియా రెచ్చిపోతుందని, నదిలో తెలంగాణ వైపున ఉన్న భాగంలో ఇసుక తీసేందుకు వెళ్లిన ట్రాక్టర్లపై కూడా కర్నూల్ జిల్లా వాళ్లు కర్రలు, రాళ్లు తీసుకుని దాడులు చేసేందుకు వస్తున్నారని తెలిపారు. అయితే వారు సరిహద్దుగా చూపుతున్న ప్రదేశంలో గతంలో తూర్పు గార్లపాడు పాత గ్రామం ఉండేదని, అలాంటి ప్రదేశం వాళ్ల పరిధిలోకి ఎలా వస్తుందని అన్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా చూసిన కూడా తెలంగాణ వైపే చూపుతుందని ఎస్‌ఐ జగదీష్ సైతం తెలిపారు. అయితే గద్వాల జిల్లా ప్రాంతం వైపునకు వచ్చి వారు ట్రాక్టర్లను అడ్డుకోవడం, అక్కడి మైనింగ్ అధికారులు ఇక్కడ కేసులు నమోదు చేయడంపై తమకు ఇబ్బందికరంగా మారిందన్నారు. దీని వల్ల తరుచూ ఘర్షణ వాతావరణం నెలకొంటుందని తెలిపారు. అయితే జిల్లాలో మన ఇసుక వాహనం ద్వారా మాకు అనుమతులు ఉన్నాయని, అయినా కూడా మేం ట్రాక్టర్లలో ఇసుక తీసుకునేందుకు ఎన్నో అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం తరపున ప్రజల అవసరాలకు ఇసుకను అందిస్తున్న తమకే ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతుంటే, ప్రజా అవసరాలకు ఇసుకను ఎలా అందిస్తామని అన్నారు. కర్నూల్ జిల్లాలోని గ్రామాల వారు అసలు నదిలోకే రావద్దంటున్నారని, దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారని ట్రాక్టర్ యజమానులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

రెండు రోజుల్లో మాట్లాడతాం..

తుంగభద్ర నదిలో జిల్లా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయని, అందుకే నదిలోకి వెళ్లి సరిహద్దు పరిశీలించామని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ విషయమై కర్నూల్ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో కూడా చర్చించామని, త్వరలోనే వారితో కలిసి నదిలో సరిహద్దులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అప్పటిదాకా హద్దులోనే ఉన్న ఇసుకను తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం అయ్యేదాకా నదిలో వివాదం ఉన్న చోటుకు వెళ్లి ఇసుక తెచ్చే ప్రయత్నం చేయవద్దని, అధికారులుగా తాము చేయాల్సిన పని చేసిన అనంతరం, సమస్య పరిష్కారం అయ్యాక ఇసుకను అనుమతుల మేరకు తీసుకోవచ్చాన్నారు. అప్పటిదాకా అవతలి వారి కవ్వింపు చర్యలకు బలికావద్దని అన్నారు. ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని అన్నారు. సరిహద్దు విషయంలో తప్పకుండా న్యాయం చేసే విధంగా ఏపీ రాష్ట్ర అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.రామ్మోహన్,సీఐ టాటాబాబు,ఎస్‌ఐ జగదీశ్ రెవెన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జనవరిలో తెలంగాణ గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే జనవరిలో తెలంగాణ గోల్డ్‌కప్ 2025 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సౌత్‌జోన్ ఇన్‌చార్జిప్రేమ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌తో పాటు 32 జిల్లాల్లో ఈసారి తెలంగాణ గోల్డ్‌కప్ పేరుతో క్రికెట్ సంబరాలు నిర్వహిస్తామని, ముందుగా నమోదు చేసుకున్న 32 జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే టోర్నీలో టాలెంట్ సెర్చ్ సైతం చేపట్టనున్నట్లు తెలిపారు. విజేతకు రూ. 50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించా రు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, మిగతా వివరాల కోసం 8341471197, 8639560573 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భూమి కొనుగోలు విషయంలో రైతు ఆత్మహత్యాయత్నం

సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో వైరల్

లింగాల: ఓ భూమి కొనుగోలు విషయంలో ఇద్దరు రైతుల మధ్య నెలకొన్న వివాదం చివరకు ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఓ చెంచు గిరిజన మహిళ తనకున్న 1.10 ఎకరాల భూమిని విక్రయించడానికి సిద్ధమైంది. అయితే అదే భూమి పక్కన ఉన్న ఇద్దరు రైతులు గొల్ల పెద్ద మల్లయ్య, ఆవుల పురుషోత్తం కొనుగోలు చేయడానికి పోటీపడ్డారు. చివరకు చెంచు మహిళ పెద్ద మల్లయ్యకు భూమి విక్రయిస్తానని చెప్పగా.. ఆవుల పురుషోత్తం అడ్డుకోవడంతో సమస్య పోలీసుల వరకు చేరింది. శుక్రవారం ఎస్‌ఐ నాగరాజు పురుషోత్తంకు నచ్చజెప్పి పంపించాడు. అయితే ఎస్‌ఐ తన పట్ల వివక్ష చూపుతున్నాడని మనస్తాపానికి గురైన పురుషోత్తం పొలం దగ్గర పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి వాట్సప్‌లో పెట్టగా.. వైరల్‌గా మారింది. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా సమస్యను సద్దుమణిగేలా సర్దిచెప్పానని, రైతుపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు, భయానికి గురి చేయలేదని చెప్పారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 8,240 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట/ మదనాపురం: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 8,240 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 862.9 అడుగుల వద్ద 115.2484 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగులు

రామన్‌పాడులో శుక్రవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటి విడుదల నిలిపివేశారు. అయితే రామన్‌పాడులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 337 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 35 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్, వాలీబాల్ టోర్నీ


హ్యాండ్‌బాల్ బాలుర విజేత మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీవైఎస్‌ఓ


వాలీబాల్ బాలికల విజేత వనపర్తి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం సీఎం కప్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్, వాలీబాల్ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు జిల్లాల బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. హ్యాండ్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. హ్యాండ్‌బాల్ బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 23–16 పాయింట్ల తేడాతో వనపర్తిపై విజయం సాధించింది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 10–5 పాయింట్ల తేడాతో వనపర్తిపై గెలుపొందింది. వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ, వనపర్తి జట్టు ద్వితీయ, బాలికల విభాగంలో వనపర్తి జట్టు ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

రాష్ట్రస్థాయి టోర్నీల్లో చాంపియన్లుగా నిలవాలి

రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీల్లో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. హ్యాండ్‌బాల్ టోర్నీలో విన్నర్, రన్నరప్ జట్లకు డీవైఎస్‌ఓ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు కబడ్డీ, నెట్‌బాల్ టోర్నీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పీడీలు వేణుగోపాల్, రమేష్‌బాబు, నిరంజన్‌రావు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ బాలుర జట్టు: శివకుమార్, ధన్‌రాజ్, రోహిత్ నాయక్, చరిత్‌రెడ్డి, శ్రీను, సకురాం, నివాస్, జగన్నాథ్, నాగ చైతన్య, శ్రీకాంత్, అశోక్, హరి, ప్రేమ్ వసంత్‌కుమార్, సమీ మహ్మద్, అక్షయ్‌గౌడ్, సాత్విక్

బాలికల జట్టు: మీనాక్షి, లక్ష్మిప్రియ, మాధురి, నందిని, బిందు ప్రియ, భార్గవి, స్వన్ని, సింధు, దివ్య, జయశ్రీ, వర్ధిని, అనిత, చిన్నారి, వర్ష, శ్రుతి, ప్రణవి

జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం

- రేపటి నుంచి కోస్గిలో ఎస్‌జీఎఫ్ అండర్–19 వాలీబాల్ టోర్నీ
- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం
- అన్ని రాష్ట్రాల నుంచి 550 మంది క్రీడాకారులు హాజరయ్యే అవకాశం


పోటీలకు మైదానం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు


డేనైట్ మ్యాచ్‌ల కోసం విద్యుత్ ఏర్పాట్లు

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణం జాతీయ క్రీడలకు వేదిక కానుంది. ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగం బాలులు వాలీబాల్ పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ మెగా టోర్నీకి దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 550 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్ మేనేజర్లు హాజరవుతున్నారని టోర్నమెంట్ ఆర్గనైజర్ బాల్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. డేనైట్ మ్యాచ్‌ల కోసం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల, వేద, కేటీఎస్, చైతన్య స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతి ఏర్పాటు చేశారు. కోచ్‌లకు ఇంజినీరింగ్ కళాశాలలో, భోజనాలు స్థానిక లక్ష్మీ నర్సింహగార్డెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పలు రాష్ట్రాల క్రీడాకారులు కోస్గికి చేరుకున్నారు. ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తదితరులు పరిశీలించారు.

కడప జైలు నుంచి రేఖమయ్య విడుదల

మహబూబ్‌నగర్ క్రైం: మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో నిందితుడిగా జైలుశిక్ష అనుభవిస్తున్న ఏ4 రేఖమయ్య శుక్రవారం ఏపీలోని కడప సెంట్రల్ జైలు నుంచి విడుదల అయ్యాడు. 2005లో జరిగిన పరిటాల రవి హత్య కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు అధికారులు వారిని విడుదల చేశారు. కడప జైలు నుంచి విడుదలైన వారిలో హ న్వాడ మండలం పుల్పోనిపల్లి గ్రామానికి చెందిన రేఖమయ్య ఉన్నాడు. వీరికి షరతులతో కూడిన బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి బయటకి వచ్చాడు. అయితే విడుదల తర్వాత రేఖమయ్య స్వగ్రామానికి వచ్చాడా.. లేదా అనే విషయం స్పష్టత లేదు. అలాగే రేఖమయ్య కుటుంబం గతంలో పుల్పోనిపల్లిలో ఉండగా.. ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు అనేది కూడా స్పష్టత లేదు.

రాష్ట్రపతి ఎట్‌హోంలో పాల్గొన్న కొత్వాల్



స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కొత్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి నమస్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రవీందర్(ఫైల్)

తెలకపల్లి: మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన గోపస్ రవీందర్(32)అనే వ్యక్తి ఈనెల 17న పురుగు మందు తాగి నాగర్‌కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

తుమ్మలసూగూర్‌లో మరొకరు..


శంకర్ (ఫైల్)

తాడూరు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని తుమ్మలసూగూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శంకర్(30) ప్రైవేటు విద్యుత్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పర్వతాయిపల్లి శివారులో తన పొలం దగ్గర ఉన్న విద్యుత్ వైర్లను సరిచేసే క్రమంలో పైనే 11 కేవీ వైర్లు తగిలి షాక్‌కు గురవడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై శంకర్ భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగతనం కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం:కోర్టులో ట్రయల్‌లో ఉన్న దొంగతనం కేసుల్లో ఇద్దరూ దొంగలకు న్యాయమూర్తి జైలు శిక్షతో పాటు జరిమానాలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో నమోదు అయిన ఐదు దొంగతనం కేసుల్లో కాత్రవత్ నరేందర్, ఆంజనేయులు అనే ఇద్దరూ దొంగలను అరెస్టు చేశారు. అయితే ఈ ఇద్దరు దొంగలు స్నాచింగ్, ఇంటి తలుపులు పగలకొట్టి దొంగతనాలు చేస్తుంటారు. ఈ కేసుల్లో 2017 నుంచి ట్రయల్‌లో ఉండగా శుక్రవారం కోర్టుకు రాగా న్యాయమూర్తి భావన దొంగతనం చేసిన ఇద్దరూ వ్యక్తులకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.